# శీతసమరము

ఫ్యాక్టరీ గేటు వద్ద ఆగింది బస్సు. బస్సు ఆగిన కుదుపుకి ఉలిక్కిపడి లేచాను.

ప్రేయసితో కలహించిన సూర్యుడు, ఎర్రని మోముతో మబ్బుల మెట్లు దిగి డ్యూటీకి వెళుతున్నాడు.

"ఏమిటిరా అలాడల్‌గా ఉన్నావు?" ఫ్యాక్టరీ గేటుదాటుతుండగా అడిగేడు మూర్తి. "ఒంట్లో బాగోలేదా?"

నాకేమీ మాట్లాడాలని అనిపించలేదు. గబగబా నా సెక్షన్ వేపు నడిచేను.

మనస్సు వికలంగా ఉంది.

పద్మకు మరీ కోపం వచ్చేట్లు మాట్లాడానా?

మాట్లాడే వుంటాను.

అందువల్లే కాబోలు ఫేక్టరీకి బయలు దేరిన నన్ను సాగనంపటానికి అలవాటు ప్రకారం గుమ్మందాకా రాలేదు.

రోడ్డు మలుపు తిరిగేటప్పుడు కూడా వెనక్కి తిరిగిచూసాను, పద్మ గుమ్మం దగ్గర నిలబడి వుందేమోనని.

ఊహూ , ఆమె కనిపించలేదు !

దానికి అంత కోపం రావటానికి నేను ఏమీ చేసానని.

డబ్బులడిగేను. అంతేకదా?

పెళ్ళాన్ని డబ్బులడగటము తప్పా !

ఫోను మ్రోగింది. అందుకున్నాను.

"నేనే - గోవిందు ......"

నా గుండె ఆగిపోయింది. గోవిందు డ్యూటీలో వున్నాడా !

"నేనే, గోవిందుని మాట్లాడుతున్నాను. ఆవిరి ఒత్తిడి బాగా పెరిగిపోతోంది"

"చూస్తానులే" నేను అన్నాను.

"నువ్వేనేమిటిరా ప్రసాద్. ఇంకా ఎవరో అనుకున్నాను" గోవిందు అన్నాడు. "ఈ రోజు తారీఖు గుర్తుందా? తొమ్మిది, తొమ్మిదో తారీఖు"

నాకు ఫోను పెట్టేయాలని అనిపించింది. కానీ గోవిందు చెప్పుకుపోతున్నాడు. "డబ్బు తెచ్చావు కదా? డ్యూటీ దిగగానే తీసుకుంటానులే"

నాకు కాళ్లూ, చేతులు ఆడలేదు. బరువుగా నడిచి 'పేనల్' దగ్గరకు, వెళ్ళాను, ఆవిరి ఒత్తిడియే కాదు, ఉష్ణోగ్రత కూడా పెరుగుతోంది.

ఇప్పుడు ఏమిటి చెయ్యడం ? గోవిందుని తప్పించుకోవటము ఎలాగ ? ఈ నెల తొమ్మిదో తారీఖున అప్పు తీర్చకపోతే నడిరోడ్డుమీద బట్టలు ఒలిచేస్తానని, నెల రోజుల క్రితమే హెచ్చరించి వున్నాడు వాడు. వాడు వెనకాడడు, చెప్పినట్లు చేసేస్తాడు.

నా గుండె ఝల్లు మంది.

"చూడు ప్రసాద్. తెలివిగా అప్పు ఎగవేద్దామని అనుకుంటున్నావేమో?" క్రితం నెల జీతం అందుకుంటున్నప్పుడే అన్నాడు గోవిందు. "అప్పు వసూలు చెయ్యటము నాకేమీ పెద్దపని కాదు. కానీ, స్నేహితుడివి కదానని వూరుకుంటున్నాను"

గోవిందు దగ్గర అప్పు తీసుకున్నందుకు నన్ను నేను తిట్టుకున్నాను. జీతం తీసుకొని ముందుకు నడిచే నా భుజం మీద చెయ్యివేసి అన్నాడువాడు, "మరో నెలరోజులు టయిమిస్తున్నాను. వచ్చేనెల తొమ్మిదో తేదీకి నా డబ్బు నా చేతిలో పడిపోవాలి. లేకపోతే........."

నేను భయంగా అతనివేపు చూసాను. అతని కళ్ళు ఎర్రగా వున్నాయి. "లేకపోతే నడిరోడ్డుమీద నీ బట్టలు ఒలిచేస్తాను జాగ్రత్త"

గోవిందు వెళ్ళిపోయాడు.

భుజం తడుముకున్నాను. గోవిందు చెయ్యివేసిన చోట బాగా నొప్పిగావుంది.

ఆవిరి ఒత్తిడి పెరిగిపోయిందని తెలిపే అలారం మ్రోగింది. మళ్ళీ గోవిందు ఫోను!

'వాడి' అప్పు తీర్చటము ఎలాగ ?

వాడికి అప్పు తీర్చటానికేగా పద్మని డబ్బులడిగేను.

డబ్బులు అడగగానే పద్మ మొహము అదోలా అయింది.

"రెండు వేలే!" పద్మ ఆశ్చర్యపోయింది. "జోక్ చేస్తున్నారా"

"జోక్ కాదే, నిజంగానే కావాలి, చాలా అవసరం"

"ఏమిటట అంత అవసరం"

నేనేమీ అనలేదు. యదాలాపముగా, ఆకాశం వైపు చూసాను.

ఎర్ర అంచుల తెల్లచీర కట్టుకుని మల్లెలు ఏరుతున్న ఆకాశాంగన, వదనములో ఓ నల్ల మబ్బు తునక పాకింది.

"మీరు మన ఒప్పందం మర్చిపోతున్నారు" పద్మ అంది. నిజమే ! నేను పెళ్ళినాటి ఒప్పందాలు మర్చిపోతున్నాను, కాదు వాటిని ఉల్లంఘిస్తున్నాను.

మాది ప్రేమ వివాహం. ఉద్యోగస్తులమైన మేము పెళ్ళికి ముందుగానే ఓ ఒప్పందము కుదుర్చుకున్నాము. ఎవరి జీతము వారిదే, ఎవరి ఖర్చులు వారివే. ఇంటి ఖర్చులు మాత్రము సమానముగా పంచుకోవాలి.

"నిజమే పద్మా" మెల్లగా గొణిగాను. "ఈ ఒక్కసారి ఆ ఒప్పందము మర్చిపో"

పద్మ పరుషముగా చూసింది. నన్ను

"రేపు గోవిందు అప్పు తీర్చకపోతే పరువుపోతుంది"

"ఓ అదా" పద్మ తేలికగా నవ్వింది. "ఆ అప్పా, మీ శనివారం ఖర్చులా...... అవన్నీ నేనెలా భరించగలను బాబు"

ప్రతీశనివారం క్లబ్బులో స్నేహితులతో కులాసాగా గడపటము నాకు అలవాటు. అది పద్మకు యిష్టము లేదని నాకు తెలుసు. ఇప్పుడు అవకాశము వచ్చింది కనుక ఎత్తిపొడుస్తోందని అర్థమైంది.

కోపం వచ్చినా, తమాయించుకున్నాను. పద్మతో అప్పుడు గొడవపెట్టు కోవటము నాకు యిష్టములేదు - నాకు డబ్బు కావాలి.

"అలా కాదే" నేను అనునయముగా అన్నాను. "రేపు డబ్బు యివ్వకపోతే నా పరువు పోతుంది"

"అందుకు"

"నీకు బోనస్ వచ్చిందిగా, అందులోనించి...."

"ఓ అదా మీ ఎత్తు ! ఆ డబ్బు మీ జల్సా ఖర్చులకు, అప్పులు తీర్చడానికి కాదు లెండీ" పద్మ విసురుగా లేచింది. "పుట్టబోయే వాడికి గొలుసుచేయించాలి"

"అంతే, మీ ఆడవాళ్ళంతా అంతే. భర్తకన్నా పిల్లలంటేనే ప్రేమ ఎక్కువ" కోపంతో నా కాళ్లు చేతులు వణికాయి. "అయినా నిన్నడగం నాదే పొరపాటు. నువ్వు ఎప్పుడు డబ్బులు యిచ్చావు కనుక. చెప్పుకోటానికి మాత్రం ఉద్యోగం చేసే పెళ్ళాం, పైసా ప్రయోజనం లేదు"

"అలా అభాండాలు వేస్తే ఊరుకోనేది లేదు" పద్మకి కూడా కోపం వచ్చినట్లుంది. "మొన్ననే కదా మీ చెల్లెలికి పంపాలని రెండు వేలు తీసుకున్నారు అది ఇంకా తీర్చనేలేదు.

"మళ్ళీ......" పద్మ తనలో తనే ఏదో గొణుక్కుంది.

"ఏమిటి ఆ గొణుగుడు?" నాకు చిరాకు వేసింది. పద్మ చిరాగ్గా కనిపిస్తే నాకు బాధగా వుంటుంది.

"నా యిష్టం నాలో నేను వంద అనుకుంటాను, మీకేమిటి? మిమ్మల్ని ఏమి అనలేదుగా?"

"ఇలా చిరాకుపడటం, గొణగటం నాకిష్టం లేదని, మానమని చెప్పానుగా"

"చెప్పారు, కానీ, నాకిష్టంలేని పనులు మీరు మాననప్పుడు, మీకు యిష్టంలేని పనులు నేనెందుకు మానాలి ?"

"నీ ఉద్దేశము?"

"అదే వందసార్లు చెప్పినా మీరు ఆ శనివారం పార్టీలు, బ్రిడ్జి మానరు"

"అబ్బో కోపానికి మాత్రము ఏమీ కొదవలేదు"

గబగబా వెళ్ళి మంచము మీద పడిపోయింది పద్మ.

ఆకాశాన తలుక్కున మెరుపులు మెరిసాయి. మా వాగ్వివాదాలే ఉరుములుగా వినిపించేయి. నామాటలకు తట్టుకోలేక పద్మ విడిచిన కన్నీరే చినుకు చినుకుగా జారి పెద్దవానైనట్లు అనిపించింది.

రాత్రి చాలాసేపు నాకు నిద్ర పట్టలేదు. కిటికీనుంచి ఆకాశాన్ని చూస్తూ పడుకున్నాను. అలిగిన ఆకాశాన మల్లెపూలు లేవు, నల్లమబ్బుల కురులని విరబోసుకొని పడుకుంది, అలిగిన ఆకాశము.

ఎప్పుడు నిద్రపట్టిందో తెలియదు. మెలుకువ వచ్చి చూసినప్పుడు పద్మ పక్కలో లేదు.

మెల్లగా లేచి చూసాను. ఉషస్సుని గర్భంలో ధరించిన రాత్రి బరువుగా కదులుతోంది.

ప్రొద్దున్నే డ్యూటీకి వెళ్ళవలసిన నాకు కాఫీ, టిఫెన్ చేసే ప్రయత్నంలో వుంది పద్మ.

నిండుచూలాలైన ఆమెమీద జాలి వేసింది. కానీ వెంటనే గుర్తుకు వచ్చింది. డబ్బులడిగితే యివ్వలేదని.

"నామాట విను పద్మా" టిఫిన్‌తింటూ అన్నాను. "ఈ రోజు డబ్బులు యివ్వకపోతే గోవిందుగోల చేస్తాడే"

"టిఫిన్ బావుందా అండీ" పద్మ నామాట పట్టించుకున్నట్లు లేదు. "ఇంకొంచెము పచ్చడి వేస్తాను నంచుకొని తినండి. నిన్న రాత్రి కూడా ఏమీ తినలేదు"

నాకు ఒళ్ళు మండిపోయింది.

ఎప్పుడూ లేని ప్రేమ భర్త తిండి విషయంలోనే ఒలకబోస్తారు కాబోలు ఈ అతివలు !

కోపంగా టిఫిన్ ప్లేట్‌నేలమీద విసిరికొట్టాను. 'షూ' వేసుకున్నాను. గట్టిగా గేటువేసి యింటివేపు చూసాను.

పద్మ జాడలేదు.

నేను విసిరికొట్టిన టిఫిన్ ప్లేటు అలాగా పడివుంది, ఆకాశాన వెలుగు కోల్పోయిన చంద్రబింబము.

"కేరేజీలు వచ్చాయిటరా" మూర్తి, మాటలకు తుళ్ళిపడి లేచాను. "భోజనము చేద్దామురా" మూర్తి చేతులు కడుక్కోటానికి వెళ్ళాడు.

తల ఎత్తి పేనల్ వేపు చూసాను. బోయిలర్‌లోని ఆవిరాతాలూకు ఒత్తిడి చూపే ముల్లు అటూ యిటూ కదులుతోంది. ఒత్తిడి అదుపులో లేదన్నమాట !

"పదరా భోజనము చేద్దాము" చేతులు కడుక్కొని వచ్చిన మూర్తి అన్నాడు. గడియారం పండ్రెండుసార్లు మ్రోగింది.

పద్మకూ భోజనము టయిమే ! డబ్బా తీసికెళ్ళిందో, లేదో ?!

ఇంతక్రితము, ఓసారి కోపము వచ్చి డబ్బాతీసికెళ్లటము మానివేసింది. ఆ రోజు అలిగి ప్రొద్దున్న టిఫిన్ కూడా తినలేదట ! ఆఫీసులో కళ్ళుతిరిగి పడిపోతే ఆటోలో యింటికి తెచ్చారు.

మరి యిప్పుడో.....

ఉత్తమనిషి కూడా కాదు.

నాకు బాధ వేసింది.

"పదరా. నాకు ఆకలి వేస్తోంది" మూర్తి తొందరపడ్డాడు.

"నాకు ఆకలిగా లేదురా. నువ్వు పోయితిను"

"ఏమిటి ఆకలిగా లేదా ! పొద్దున్నే టిఫిన్ క్రింద ఏమీ వడ్డించిందిరా మీ ఆవిడ"

నేనేమీ అనలేదు.

"పొద్దున్న నుంచీ చూస్తూనే వున్నాను. అదోలా వున్నావు. ఏమైందిరా నీకు"

నేనేమి అనలేదు.

ఆవిరి ఒత్తిడి చూపే ముల్లువైపు దృష్టి మళ్ళించాను.

"ఇంట్లో గొడవపడి వచ్చావా?" మూర్తి అడిగాడు. "నేను ఎలా ఊహించానని అనుకోకు. నీ వయస్సుదాటి వచ్చిన వాడిని. జీవితము చూసినవాడిని" అతను సాలోచనగా అన్నాడు. "నీవు ఒకటే అర్థం చేసుకో. నీతో జీవితాంతం నడిచేది నీ భార్య ఒక్కతే. పిల్లలు, తల్లిదండ్రులు కారు అందుకని....."

"అందుకని ఆవిడని నెత్తిమీద పెట్టుకొని వూరేగమంటావా?" నాకోపం తట్టలు తెంచుకొని పరుగెత్తింది. "అయినా నేనేమి అడిగానని ఓ రెండు వేలు సర్ధమన్నాను అంతేగా!"

"అయితే నేను అనుకున్నది నిజమే నన్నమాట" మూర్తి చిరునవ్వుతో అన్నాడు. "డబ్బు ఆవిడే యిస్తుందిలే, దాని గురించి గొడవ పడ్డావేమిటిరా ! ఆవిడ ఎంత బాధపడి వుంటుందోనని ఆలోచించావా ?"

ఎందుకు బాధపడదు ?

పద్మని ఎన్నెన్ని మాటలన్నాను. టిఫిన్ ప్లేట్ మొహం మీద విసరి కొట్టాను.

ఛీ ! ఛీ ! నాకు నామాదే అసహ్యం వేసింది.

"నాకు ఆకలి వేస్తోందిరా" మూర్తి వెళ్ళిపోయాడు.

ఆవిరి ఒత్తిడి తగ్గిపోయిందని తెలిపే అలారము మ్రోగింది. కుర్చీలోనించి లేచాను.

"నువ్వు ఈ రోజు బాయిలర్ ట్రిప్‌చేసేలా వున్నావు" పరుగెత్తుకొని వస్తూ అన్నాడు మా ఇంజనీర్. "అయినా పనిచెయ్యాలని లేనప్పుడు సెలవు పెట్టి ఏడ్వవచ్చుకదా? డ్యూటీకి వచ్చి మిమ్మల్ని ఏడిపించటం ఎందుకు?" అతను కోపముగా అన్నాడు.

నిజమే సెలవు పెట్టవచ్చుకదా !

సెలవు చీటీ యిచ్చి యింటికి బయలుదేరాను.

వాతావరణము చల్లగావుంది. అంతవరకు ప్రపంచము మీద మండిపడిన సూర్యుడు తన తప్పు తెలుసుకొని మబ్బు వెనుక మోముదాచుకున్నాడు.

గోద్రెజ్ తాళం తీసి యింటిలోనికి వెళ్ళాను. ఎదురుగా కనిపించేయి పద్మజోళ్ళు.

పద్మ ఆఫీసుకి వెళ్ళలేదా ?

బెడ్‌రూముకి వెళ్ళాడు, అలసిపోయి పడుకుందేమోనని, కానీ, పద్మలేదు అక్కడ.

కంగారుగా రెండో బెడ్‌రూములోకి వెళ్ళిచూసాను. అక్కడా లేదు పద్మ!

నాకు కంగారు పుట్టకొచ్చింది.

ఏమైంది పద్మకి !

ఆకలికీ, అలసటకీ తట్టుకోలేక పోయాను. చల్లని నీరు త్రాగాలని భోజనాల గదిలోకి వెళ్ళాను.

అక్కడ కనిపించింద పద్మ

డైనింగ్ టేబుల్‌మీద తలపెట్టుకొని కూర్చుని వుంది, ఆమె !

పక్కనే నేలమీద నేను పొద్దున్న విసరికొట్టిన, టిఫిన్ ప్లేటు !

పద్మ ఏడుస్తోందా ?

(కోకిల మాసపత్రిక)